https://siddipettimes.com

# సిద్దిపేట టైమ్స్

తెలుగు దినపత్రిక


సంపుటి - 02 | సంచిక -150 | తెలంగాణ | గురువారం | తేదీ: 23.10.2025 | ఎడిటర్ : మదూరి శ్రీరామ్ | పేజీలు 8 | వెల రూ.3



## భారీగా తగ్గిన బంగారం ధర

వెండి కూడా అదే దారిలో పతనం

2లో..



## అర్హులందరికీ తెల్ల రేషన్ కార్డులు

- ఇంచార్జ్ మంత్రి గడ్డం వివేక్
- లబ్ధిదారులకు రూ.9.95 కోట్ల కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట, అక్టోబర్ 22 :

సిద్దిపేట ఐడీఓసీ సమావేశ మందిరంలో బుధవారం సాయంత్రం కళ్యాణలక్ష్మి, శాదిముబారక్ పథకాల కింద లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాకు ఇంచార్జ్ మంత్రిగా ఉన్న గడ్డం వివేక్ ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని అర్హులందరికీ రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు తదితర పథకాలు అందించడంపై ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

2లో..

# ఉస్మానియా భవనాన్ని రెండేళ్లలో పూర్తి చేయండి

- అత్యాధునిక వైద్య పరికరాలకు అనుగుణంగా నిర్మాణ ప్రణాళికలు సిద్ధం చేయాలి
- సీఎం రేవంత్ రెడ్డి గడువు
- ప్రతిష్టాత్మక ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష.
- సమస్యల పరిష్కారానికి వెంటనే సమన్వయ కమిటీ ఏర్పాటు
- ప్రతి పది రోజులకోసారి కమిటీ సమావేశమై పనుల పురోగతిని సమీక్షించాలి



సిద్దిపేటటైమ్స్, హైదరాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 22,

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉస్మానియా ఆసుపత్రి నూతన భవన నిర్మాణంపై ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఈ భవన నిర్మాణాన్ని రెండేళ్లలో పూర్తి చేయాలని ఆయన అధికారులను ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ఆదేశించారు. నూతన ఆసుపత్రి నిర్మాణానికి సంబంధించిన ప్రగతిని ముఖ్యమంత్రి ఈ సమావేశంలో సమీక్షించారు. అవసరాలకు తగినట్లుగా అధునాతన వైద్య పరికరాలను సమకూర్చుకోవాలని, ఇందుకు సంబంధించిన ప్రణాళికలను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టం చేశారు. అధునాతన పరికరాల ఏర్పాటుకు అనుగుణంగా గదులు, ల్యాబ్‌లు, ఇతర నిర్మాణాల రూపకల్పన ఉండాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు.

2లో..

## జూబ్లీహిల్స్ నామినేషన్ల స్క్రూటినీ పూర్తి..

- మిగిలింది 81 మందే..

సిద్దిపేట టైమ్స్, హైదరాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 22 :

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక బరిలో భారీ సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. అనంతరం, బుధవారం నామినేషన్ల స్క్రూటినీ ప్రక్రియ ముగిసింది. 17 గంటల పాటు జరిగిన వడపోత అనంతరం పోటీలో 81 మంది అభ్యర్థులు మిగిలారు. 135 నామినేషన్లను ఎన్నికల అధికారి ఖరారు చేశారు. వివిధ కారణాలతో 130 మంది అభ్యర్థులు వేసిన 186 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. కాగా, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల కోసం 211 మంది అభ్యర్థులు 321 నామినేషన్లు వేసిన విషయం తెలిసిందే.

2లో..



## రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రవాణా చెక్‌పోస్టుల ఎత్తివేత

- తక్షణమే మూసివేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు
- అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన రవాణా శాఖ
- సిబ్బందిని జిల్లా కార్యాలయాలకు తరలించాలని సూచన
- బోర్డులు, బారికేడ్లు తొలగించి వీడియో తీయాలని ఆదేశం

2లో..



## శబరి గిరుల్లో చారిత్రక ఘట్టం..

- ఇరుముడితో పడిమెట్లెక్కిన రాష్ట్రపతి..
- శబరిమలలో ముర్ము ప్రత్యేక పూజలు
- పుణ్యక్షేత్రానికి వెళ్లిన తొలి మహిళా దేశాధినేతగా రికార్డు
- సాంప్రదాయబద్ధంగా ఇరుముడి ధరించి 18 పవిత్ర మెట్లు ఎక్కిన ముర్ము

శబరిమల : శబరిమల అయ్యప్ప స్వామి ఆలయం ఒక చారిత్రక ఘట్టానికి వేదికైంది. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం స్వామివారిని దర్శించుకున్నారు. తద్వారా, ఈ ప్రఖ్యాత పుణ్యక్షేత్రాన్ని సందర్శించిన తొలి మహిళా దేశాధినేతగా ఆమె చరిత్ర సృష్టించారు. గతంలో 1970లలో మాజీ రాష్ట్రపతి వీవీ గిరి శబరిమలను సందర్శించారు.

2లో..

### 15 శాతానికి తగ్గనున్న ట్రంప్ టారిఫ్ లు..

## అమెరికాతో భారత్ డీల్..!

- భారత ఎగుమతులపై ప్రస్తుతం 50 శాతం వసూలు చేస్తున్న అగ్రరాజ్యం
- త్వరలో ఇరు దేశాల మధ్య కుదరనున్న ఒప్పందం.. తగ్గనున్న సుంకాలు
- భారతీయ మార్కెట్లలోకి అమెరికా వ్యవసాయ ఉత్పత్తుల ఎంట్రీ..!

న్యూఢిల్లీ : మనదేశంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన టారిఫ్ లు తగ్గనున్నట్లు పలు అంతర్జాతీయ మీడియా సంస్థలు కథనాలు ప్రచురించాయి. ఇరు దేశాల మధ్య త్వరలో ఒప్పందం కుదరనుందని పేర్కొన్నాయి. ప్రస్తుతం భారత్ నుంచి అమెరికాలోకి దిగుమతి అవుతున్న వస్తువులపై 50 శాతం పన్ను వసూలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో రష్యా నుంచి చమురు దిగుమతి చేస్తున్నందుకు ట్రంప్ 25 శాతం ప్రతీకార సుంకాలు కూడా ఉన్నాయి. అయితే, ఇరు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం కుదురుతుందని, ఆ తర్వాత ట్రంప్ సుంకాలు 15 శాతానికి తగ్గే అవకాశం ఉందని తెలిపాయి.

2లో..




## సృష్టి ఫెర్టిలిటీ స్కామ్‌లో ఈడీ దర్యాప్తు

- జైల్లో నిందితుల విచారణకు ఈడీకి అనుమతి

సిద్దిపేట టైమ్స్, హైదరాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 22 :

సృష్టి ఫెర్టిలిటీ స్కామ్‌కు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అ౽ధికారులు లోతైన విచారణ ప్రారంభించారు. ఈ కేసులో ఇప్పటి వరకు అరెస్టయిన 25మంది నిందితుల్లో కొందరిని ప్రశ్నించడానికి ఈడీ అధికారులు కోర్టు అనుమతి పొందారు. బుధవారం నుంచి ఈ నెల 28వ తేదీ వరకు చంచల్‌గూడ జైల్లో ఉన్న నిందితులను విచారించడానికి ఈడీకి కోర్టు అనుమతించింది. ఈ క్రమంలో ఈడీ అధికారులు బుధవారం చంచల్‌గూడ జైలుకు వెళ్లి డాక్టర్ నమ్రత, ఆమె కుమారుడు జయంత్ కృష్ణ, నందిని, సంతోషి, కల్యాణిలను వేర్వేరుగా ప్రశ్నించారు.

2లో..



## భారీగా తగ్గిన బంగారం ధర

**- వెండి కూడా అదే దారిలో పతనం**

**న్యూఢిల్లీ :** ఆకాశమే హద్దుగా దూసుకుపోయిన బంగారం, వెండి ధరలు.. అంతే వేగంగా తగ్గుముఖం పడుతున్నాయి. గత వారం ఆల్‌టైమ్ హై రికార్డులతో పరుగులు పెట్టిన రేట్లు.. ఇప్పుడు రివర్స్ గేర్ తీసుకున్నాయి. ఈ క్రమంలోనే దాదాపు వారం రోజుల్లో తులం పసిడి విలువ రూ.10 వేలదాకా, కిలో వెండి రూ.20 వేలవరకు క్షీణించాయి. బుధవారం 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) గోల్డ్ రేటు రూ.1,25,000 నుంచి రూ.1,26,000 మధ్య ఉన్నది. మంగళవారంతో పోల్చితే రూ.4,000 నుంచి రూ.5,000 దిగొచ్చింది. 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) పుత్తడి ధర రూ.1,15,000 నుంచి రూ.1,16,000 పలికింది. ఒక్కరోజులో రూ.4,000 నుంచి 5,000 క్షీణించినట్టు స్థానిక మార్కెట్ వర్గాలు వెల్లడించాయి. ఇక కిలో వెండి ధర రూ.1,65,000గా నమోదైంది. ఈ ఒక్క రోజే రూ.7,000 దిగిరావడం గమనార్హం. నిజానికి దేశీయ స్పాట్ మార్కెట్‌లో ఈ నెల 17న 24 క్యారెట్ తులం బంగారం ధర మునుపెన్నడూ లేనివిధంగా రూ.1,34,800గా ఉన్నది. అలాగే 14న కిలో వెండి రూ.1,85,000 పలికింది. ఇన్నాళ్లూ పెరుగుతూపోయిన ధరలు.. ఇప్పుడు క్రమేణా తగ్గుముఖం పడుతుండటంతో కొనుగోలుదారులు వేచిచూసే ధోరణిని అనుసరిస్తున్నారు. అయితే ప్రస్తుత పండుగ సీజన్‌తో పాటు పెండ్లిళ్ల సీజన్ దృష్ట్యా అవసరం ఉన్నంత మేరకే కొనడానికి ముందుకొస్తున్నారని వ్యాపారులు చెప్తున్నారు. ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా 10 గ్రాముల 24 క్యారెట్ గోల్డ్ వాల్యూ రూ.55 వేలు ఎగబాకింది. ఇక కిలో వెండి రేటు ఏకంగా రెట్టింపునకు పైగా ఎగసింది. గత ఏడాది ఆఖర్లో తులం బంగారం రూ.78,950గా, కిలో వెండి రూ.89,700గా ఉన్నాయి మరి. దీంతో మున్ముందు మరింతగా ధరలు దిగివస్తాయన్న ఆశాభావంతో కస్టమర్లు తమ కొనుగోళ్లను ఇప్పటికైతే వాయిదానే వేసుకుంటున్నారని జ్యువెల్లర్స్ ప్రస్తుత వ్యాపార సరళిని వివరిస్తున్నారు. ఈసారి ధనత్రయోదశి (ధంతేరాస్) అమ్మకాలు కూడా అంతంతమాత్రంగానే జరిగినట్టు దేశవ్యాప్తంగా ఉన్న జ్యువెల్లర్స్ చెప్తున్న సంగతి విదితమే. అధిక ధరల కారణంగా విక్రయాలు తగ్గినట్టు నగల వర్తకులు అంటున్నారు. దేశీయ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు ఇంతలా దిగిరావడం వెనుక అంతర్జాతీయ కారణాలే కనిపిస్తున్నాయి. గ్లోబల్ మార్కెట్‌లో ఔన్స్ గోల్డ్ 4,109.19 డాలర్లుగా ఉన్నది. సోమవారం ట్రేడింగ్‌లో ఆల్‌టైమ్ హైని తాకుతూ 4,381.21 డాలర్లు పలికిన విషయం తెలిసిందే. అయితే మంగళవారం 2020 ఆగస్టు నుంచి గమనిస్తే ఎప్పుడూ లేనంతగా ఏకంగా 5 శాతానికిపైగా ధరలు పతనమైయ్యాయి. బుధవారం ఆ క్షీణత కొనసాగింది. ఈ నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఒక్కసారిగా భయాందోళనలకు గురై లాభాల స్వీకరణకు దిగుతున్నారు. దీంతో డిమాండ్ తగ్గి ధరలు ఇంకా పడిపోతున్నాయని మార్కెట్ నిపుణులు ప్రస్తుత ట్రెండ్‌ను విశ్లేషిస్తున్నారు.

# ఉస్మానియా భవనాన్ని రెండేళ్లలో పూర్తి చేయండి

**- అత్యాధునిక వైద్య పరికరాలకు అనుగుణంగా నిర్మాణ ప్రణాళికలు సిద్ధం చేయాలి**
**- సీఎం రేవంత్ రెడ్డి గడువు**
**- ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష.**
**- సమస్యల పరిష్కారానికి వెంటనే సమన్వయ కమిటీ ఏర్పాటు**
**- ప్రతి పది రోజులకోసారి కమిటీ సమావేశమై పనుల పురోగతిని సమీక్షించాలి**

**సిద్దిపేటటైమ్స్, హైదరాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 22,**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఉస్మానియా ఆసుపత్రి నూతన భవన నిర్మాణంపై ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఈ భవన నిర్మాణాన్ని రెండేళ్లలో పూర్తి చేయాలని ఆయన అధికారులను ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ఆదేశించారు. నూతన ఆసుపత్రి నిర్మాణానికి సంబంధించిన ప్రగతిని ముఖ్యమంత్రి ఈ సమావేశంలో సమీక్షించారు. అవసరాలకు తగినట్లుగా అధునాతన వైద్య పరికరాలను సమకూర్చుకోవాలని, ఇందుకు సంబంధించిన ప్రణాళికలను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టం చేశారు. అధునాతన పరికరాల ఏర్పాటుకు అనుగుణంగా గదులు, ల్యాబ్‌లు, ఇతర నిర్మాణాల రూపకల్పన ఉండాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ఆసుపత్రి నిర్మాణ పనులతో పాటు స్థానికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చుట్టూ రోడ్ల నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. నిర్మాణ పనుల వేగవంతం కోసం, తలెత్తే సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు వైద్య ఆరోగ్య శాఖ, పోలీసు, జీహెచ్ఎంసీ, ఆర్ అండ్ బీ, విద్యుత్ శాఖ అధికారులతో వెంటనే ఒక సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కమిటీ క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ప్రతి పది రోజులకోకసారి సమావేశమై, సమస్యలను పరిష్కరిస్తూ పనులు వేగంగా జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణం పూర్తయ్యాక అక్కడి బందోబస్తు, ట్రాఫిక్ విధుల నిర్వహణకు సంబంధించి ముందుస్తుగానే తగిన ప్రణాళికలు రూపొందించాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఆసుపత్రికి వివిధ రహదారులను అనుసంధానించే ప్రణాళికలను ఇప్పటి నుంచే రూపొందించాలని ఆర్ అండ్ బీ అధికారులకు సీఎం సూచించారు. అంతే కాకుండా, హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో నిర్మాణంలో ఉన్న ఆసుపత్రులు, మెడికల్ కళాశాలల నిర్మాణానికి సంబంధించి ప్రతి నిర్మాణానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆ అధికారి ఆయా నిర్మాణాలపై 24 గంటలు పర్యవేక్షించేలా పూర్తిస్థాయి బాధ్యతలను అప్పగించాలని, ఆయా నిర్మాణాలన్నీ వచ్చే జూన్ నాటికి పూర్తి చేయాలని ముఖ్యమంత్రి గట్టి ఆదేశాలు జారీ చేశారు. నిర్మాణ పనుల్లో జాప్యాన్ని సహించేది లేదని ఆయన అధికారులను హెచ్చరించారు.

## అర్హులందరికీ తెల్ల రేషన్ కార్డులు, సన్న బియ్యం





**- ఇంచార్జ్ మంత్రి గడ్డం వివేక్**
**- లబ్ధిదారులకు రూ.9.95 కోట్ల చెక్కుల పంపిణీ**

**సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట, అక్టోబర్ 22 :**

సిద్దిపేట ఐడీఓసీ సమావేశ మందిరంలో బుధవారం సాయంత్రం కళ్యాణలక్ష్మి, శాదిముబారక్ పథకాల కింద లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాకు ఇంచార్జ్ మంత్రిగా ఉన్న గడ్డం వివేక్ ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని అర్హులందరికీ రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు తదితర పథకాలు అందించడంపై ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 26 వేల కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసినట్లు తెలిపారు. డిసెంబర్ నాటికి ఇళ్ల పంపిణీ పూర్తవుతుందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్‌కు పథకాల అమలులో ఎదురయ్యే సమస్యలను తక్షణమే పరిష్కరించాలంటూ మంత్రి ఆదేశాలు జారీ చేశారు. కళ్యాణలక్ష్మి, శాదిముబారక్ పథకాల కింద సిద్దిపేట నియోజకవర్గానికి 381 మందికి ₹3.81 కోట్లు, దుబ్బాకలో 410 మందికి ₹4.10 కోట్లు, గజ్వేల్‌లో 204 మందికి ₹2.04 కోట్లు పంపిణీ చేశారు. మొత్తంగా 995 లబ్ధిదారులకు ₹9.95 కోట్ల విలువైన చెక్కులు అందజేశారు. జిల్లాలో మొత్తం 74,386 కొత్త రేషన్ కార్డులు మంజూరు కాగా, వీటిలో సిద్దిపేటకు 24,073, గజ్వేల్ - 15,659, దుబ్బాక - 14,819, హుస్నాబాద్ - 9,738, జనగాం - 7,687, మానకొండూర్ - 2,410 కార్డులు మంజూరు అయ్యాయి. ఇందిరమ్మ ఇళ్ల కింద 11,201 ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో 8,929 ఇళ్లకు గ్రౌండింగ్ పనులు ప్రారంభమయ్యాయి. మహాలక్ష్మి పథకంలో 1,79,300 కుటుంబాలకు ₹2,282.69 లక్షలు, గృహజ్యోతి పథకంలో 2,04,250 గృహాలకు ₹9,782.04 లక్షలు మంజూరయ్యాయి. రైతు బరోసా పథకంలో 3,20,379 మంది రైతులకు ₹355.68 కోట్లు మంజూరు చేశారు. మహిళా ఉచిత ఆర్టీసీ ప్రయాణ పథకం కింద 6.94 లక్షల మంది ప్రయాణించగా, దీనిపై ప్రభుత్వం ₹228.67 కోట్లు ఖర్చు చేసింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే హరీష్ రావు, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, జిల్లా కలెక్టర్ కె. హైమావతి, మున్సిపల్ వైస్ చైర్మన్ కనక రాజు, అధికారులు పాల్గొన్నారు.



## శబరి గిరుల్లో చారిత్రక ఘట్టం..



**- ఇరుముడితో పడిమెట్లెక్కిన రాష్ట్రపతి..**
**- శబరిమలలో ముర్ము ప్రత్యేక పూజలు**
**- పుణ్యక్షేత్రానికి వెళ్లిన తొలి మహిళా దేశాధినేతగా రికార్డు**
**- సాంప్రదాయబద్ధంగా ఇరుముడి ధరించి 18 పవిత్ర మెట్లు ఎక్కిన ముర్ము**

**శబరిమల :** శబరిమల అయ్యప్ప స్వామి ఆలయం ఒక చారిత్రక ఘట్టానికి వేదికైంది. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం స్వామివారిని దర్శించుకున్నారు. తద్వారా, ఈ ప్రఖ్యాత పుణ్యక్షేత్రాన్ని సందర్శించిన తొలి మహిళా దేశాధినేతగా ఆమె చరిత్ర సృష్టించారు. గతంలో 1970లలో మాజీ రాష్ట్రపతి వీవీ గిరి శబరిమలను సందర్శించగా, ఆ తర్వాత అయ్యప్పను దర్శించుకున్న రెండో భారత రాష్ట్రపతిగా ద్రౌపది ముర్ము నిలిచారు. కేరళలో నాలుగు రోజుల పర్యటనలో భాగంగా ఆమె శబరిమలకు చేరుకున్నారు. బుధవారం ఉదయం 11 గంటలకు పంబా బేస్ క్యాంపు వద్దకు వచ్చిన ఆమె, మొదట పంపా నదిలో పాదాలను శుభ్రం చేసుకుని, సమీపంలోని గణపతి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం నల్ల చీర ధరించి సంప్రదాయబద్ధంగా 'కెట్టునిర' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆమె 'ఇరుముడికెట్టు'ను సిద్ధం చేశారు. రాష్ట్రపతితో పాటు ఆమె అల్లుడు గణేష్‌చంద్ర హోంబ్రామ్, ఇతర సిబ్బంది కూడా ఇరుముడిని సిద్ధం చేసుకున్నారు. పంబ నుంచి ప్రత్యేక వాహనంలో సన్నిధానానికి చేరుకున్న రాష్ట్రపతికి ఆలయ తంత్రి కందరారు మహేష్ మోహనారు 'పూర్ణకుంభ' స్వాగతం పలికారు. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి వీఎన్ వాసవన్ కూడా ఆమెకు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. అనంతరం ద్రౌపది ముర్ము పవిత్రమైన ఇరుముడిని తలపై పెట్టుకుని, 18 మెట్లను ఎక్కి అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు. ఆమె ఇరుముడిని ప్రధాన అర్చకులు తీసుకుని పూజలు నిర్వహించారు. ఆ తర్వాత మాలికాపురం ఆలయాన్ని కూడా ఆమె సందర్శించారు. రాష్ట్రపతి పర్యటనపై బీజేపీ ఎంపీ బండి సంజయ్ కుమార్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందించారు. "ఆమె వయసు 67. ఆమె ఏ నిబంధనలను ఉల్లంఘించలేదు, ఏ విశ్వాసాన్ని గాయపరచలేదు. కేవలం గౌరవించారు. ఇరుముడితో అయ్యప్పను దర్శించుకున్న తొలి రాష్ట్రపతిగా నిలిచారు" అని ఆయన పేర్కొన్నారు. "భక్తి అనేది నిశ్శబ్దంగానే నిలబడుతుందని ఈ పర్యటన గుర్తుచేసింది. కోట్లాది అయ్యప్ప భక్తులను ఏకం చేసే విశ్వాసానికి ఈ క్షణం అద్దం పడుతోంది" అని ఆయన తన పోస్టులో రాశారు. మహిళల ప్రవేశంపై 2018లో సుప్రీంకోర్టు చారిత్రక తీర్పు వెలువరించిన నేపథ్యంలో ఒక మహిళా దేశాధినేత ఆలయాన్ని సందర్శించడం ప్రాధాన్యత సంతరించుకుంది. కాగా, రాష్ట్రపతి పర్యటన సందర్భంగా సాధారణ భక్తుల ప్రవేశాన్ని తాత్కాలికంగా నిలిపివేసినట్లు ట్రావెన్‌కోర్ దేవస్వమ్ బోర్డు అధికారులు

## 15 శాతానికి తగ్గనున్న ట్రంప్ టారిఫ్ లు.. అమెరికాతో భారత్ డీల్..!

**- భారత ఎగుమతులపై ప్రస్తుతం 50 శాతం వసూలు చేస్తున్న అగ్రరాజ్యం**
**- త్వరలో ఇరు దేశాల మధ్య కుదరనున్న ఒప్పందం.. తగ్గనున్న సుంకాలు**
**- భారతీయ మార్కెట్లలోకి అమెరికా వ్యవసాయ ఉత్పత్తుల ఎంట్రీ..!**

న్యూఢిల్లీ : మనదేశంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన టారిఫ్ లు తగ్గనున్నట్లు పలు అంతర్జాతీయ మీడియా సంస్థలు కథనాలు ప్రచురించాయి. ఇరు దేశాల మధ్య త్వరలో వాణిజ్య ఒప్పందం కుదరనుందని పేర్కొన్నాయి. ప్రస్తుతం భారత్ నుంచి అమెరికాలోకి దిగుమతి అవుతున్న వస్తువులపై 50 శాతం పన్ను వసూలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో రష్యా నుంచి చమురు దిగుమతి చేస్తున్నందుకు ట్రంప్ 25 శాతం ప్రతీకార సుంకాలు కూడా ఉన్నాయి. అయితే, ఇరు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం కుదురుతుందని, ఆ తర్వాత ట్రంప్ సుంకాలు 15 శాతానికి తగ్గే అవకాశం ఉందని తెలిపాయి. ఒప్పందంలో భాగంగా రష్యా నుంచి చమురు దిగుమతులను భారత్ తగ్గించనుందని, అమెరికా వ్యవసాయ ఉత్పత్తులను భారత మార్కెట్లోకి అనుమతించనుందని విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఆంగ్ల మీడియా కథనం వెల్లడించింది. కేంద్ర ప్రధాన ఆర్థిక సలహాదారు వి.అనంత నాగేశ్వరన్ కూడా వాణిజ్య ఒప్పందం ఖరారుపై విశ్వాసం వ్యక్తంచేశారు. భారత్, అమెరికాల మధ్య వాణిజ్య ఒప్పందంలో అమెరికా వ్యవసాయ ఉత్పత్తులు కీలకంగా మారాయి. తమ వ్యవసాయ ఉత్పత్తులకు భారత్ తలుపులు బార్లా తెరవాలని ట్రంప్ పట్టుబడుతున్నారు. ఈ డిమాండ్‌కు కేంద్ర ప్రభుత్వం ఒప్పుకోకపోవడంతో చర్చలు ముందుకు సాగడంలేదు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లు జరపడంపైనా ట్రంప్ ఆగ్రహంగా ఉన్నారు. అయితే, ఇటీవల జరిగిన చర్చల్లో ఈ అంశాలపై పరస్పర అంగీకారానికి వచ్చినట్లు తెలుస్తోంది. రష్యా నుంచి దిగుమతులు క్రమంగా తగ్గించడంతో పాటు అమెరికా మొక్కజొన్న, సోయామీల్‌ను కూడా భారత మార్కెట్లోకి అనుమతించే అవకాశం ఉన్నట్లు సదరు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. అయితే మొక్కజొన్నపై 15 శాతం దిగుమతి సుంకం కొనసాగించనున్నట్లు తెలుస్తోంది. ట్రేడ్ వార్ పరిస్థితుల నేపథ్యంలో అమెరికా నుంచి మొక్కజొన్న దిగుమతులను చైనా తగ్గించుకుంది. ఈ పరిస్థితుల్లో తమ రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు ట్రంప్ ప్రత్యామ్నాయంగా భారత మార్కెట్లలోకి ఎంట్రీ ఇవ్వాలని ప్రయత్నిస్తున్నారు.

## రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రవాణా చెక్‌పోస్టుల ఎత్తివేత

**- తక్షణమే మూసివేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు**
**- అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన రవాణా శాఖ**
**- సిబ్బందిని జిల్లా కార్యాలయాలకు తరలించాలని సూచన**
**- బోర్డులు, బారికేడ్లు తొలగించి వీడియో తీయాలని ఆదేశం**

**సిద్దిపేట టైమ్స్, హైదరాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 22 :**

తెలంగాణలో వాహనదారులకు ఊరట కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని రవాణా శాఖ చెక్‌పోస్టులను తక్షణమే ఎత్తివేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. సీఎం ఆదేశాల మేరకు రవాణా శాఖ ఈ నిర్ణయాన్ని వెంటనే అమలు చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. రవాణా శాఖ కమిషనర్ జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం, ఈరోజు సాయంత్రం 5 గంటలలోగా రాష్ట్రంలోని అన్ని చెక్‌పోస్టుల కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేయాలని జిల్లా రవాణా అధికారులు , డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్లను ఆదేశించారు. ఆగస్టు 28, 2025న విడుదలైన ప్రభుత్వ ఉత్తర్వు (G.O. Ms. No. 58) ప్రకారం ఈ చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. ఈ ఆదేశాల ప్రకారం, రహదారులపై వాహనాల రాకపోకలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూసేందుకు చెక్‌పోస్టుల వద్ద ఉన్న బోర్డులు, బారికేడ్లు, ఇతర సూచికలను పూర్తిగా తొలగించాలని సూచించారు. ఈ తొలగింపు ప్రక్రియను తప్పనిసరిగా వీడియో తీసి, నివేదికతో పాటు ఉన్నతాధికారులకు పంపాలని స్పష్టం చేశారు. చెక్‌పోస్టుల మూసివేత ప్రక్రియ సాయంత్రం 5 గంటల లోపు పూర్తి కావాలని గడువు విధించారు. ప్రస్తుతం చెక్‌పోస్టులలో పని చేస్తున్న సిబ్బందిని వారి సంబంధిత జిల్లా రవాణా కార్యాలయాలకు పంపాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అదేవిధంగా, చెక్‌పోస్టులలో ఉన్న ఫర్నిచర్, రికార్డులు, పరికరాలు, ఇతర వస్తువులను వెంటనే డీటీవో కార్యాలయాలకు తరలించాలని తెలిపారు. క్యాష్ బుక్కులు, రసీదులు, చలాన్లతో సహా అన్ని ఆర్థిక, పరిపాలనా రికార్డులను సరిచూసి భద్రపరచాలని ఆదేశించారు. చెక్‌పోస్టుల మూసివేత సమాచారాన్ని వాహనదారులకు తెలియజేసేందుకు సంబంధిత ప్రాంతాల్లో పబ్లిక్ నోటీసులు ప్రదర్శించాలని కమిషనర్ సూచించారు. సిబ్బంది పునర్‌నియామకం, రికార్డుల తరలింపు, చెక్‌పోస్టుల పూర్తి మూసివేతపై సమగ్ర నివేదికను ఈరోజు సాయంత్రం 5 గంటల లోపు తమ కార్యాలయానికి సమర్పించాలని కమిషనర్ స్పష్టం చేశారు.

## జూబ్లీహిల్స్ నామినేషన్ల స్క్రూటినీ పూర్తి..

**సిద్దిపేట టైమ్స్, హైదరాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 22 :**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక బరిలో భారీ సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. అనంతరం, బుధవారం నామినేషన్ల స్క్రూటినీ ప్రక్రియ ముగిసింది. 17 గంటల పాటు జరిగిన వడపోత అనంతరం పోటీలో 81 మంది అభ్యర్థులు మిగిలారు. 135 నామినేషన్లను ఎన్నికల అధికారి ఖరారు చేశారు. వివిధ కారణాలతో 130 మంది అభ్యర్థులు వేసిన 186 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. కాగా, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల కోసం 211 మంది అభ్యర్థులు 321 నామినేషన్లు వేసిన విషయం తెలిసిందే. ఇక, రేపు నామినేషన్ల విత్ డ్రాకు అవకాశం ఉంది. వీరిలో ఎంత మంది విత్‌డ్రా చేసుకుంటారనే ఉత్కంఠ నెలకొంది. మరోవైపు.. స్క్రూటినీ సందర్భంగా సరైన ఫార్మాట్‌లో పత్రాలు సమర్పించకపోవడం, వివరాలు అసంపూర్తిగా ఉండటంతో నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. నామినేషన్ల పరిశీలన ప్రక్రియను కేంద్ర ఎన్నికల సంఘం నియమించిన సాధారణ పరిశీలకులు రంజిత్ కుమార్ సింగ్ దగ్గరుండి పర్యవేక్షించారు. కాంగ్రెస్ తరపున నవీన్ యాదవ్, బీఆర్ఎస్ తరపున మాగంటి సునీత నామినేషన్లను రిటర్నింగ్ అధికారి ఆమోదించారు. ఇదిలా ఉండగా.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ప్రధాన పార్టీలతో పాటు స్వతంత్రులు, రీజినల్ రింగ్ రోడ్డు బాధిత రైతులు, ఓయూ, నిరుద్యోగ సంఘాల నాయకులు నామినేషన్లు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఉప ఎన్నికకు నవంబర్ 11న పోలింగ్ జరగనుండగా 14న ఫలితాలు విడుదల కానున్నాయి. ఉప ఎన్నికల కోసం ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ప్రచారంలో దూసుకెళ్తున్నాయి.

## సృష్టి ఫెర్టిలిటీ స్కామ్‌లో ఈడీ దర్యాప్తు

**సిద్దిపేట టైమ్స్, హైదరాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 22**

సృష్టి ఫెర్టిలిటీ స్కామ్‌కు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అఽధికారులు లోతైన విచారణ ప్రారంభించారు. ఈ కేసులో ఇప్పటి వరకు అరెస్టయిన 25మంది నిందితుల్లోకొందరిని ప్రశ్నించడానికి ఈడీ అధికారులు కోర్టు అనుమతి పొందారు. బుధవారం నుంచి ఈ నెల 28వ తేదీ వరకు చంచల్‌గూడ జైల్లో ఉన్న నిందితులను విచారించడానికి ఈడీకి కోర్టు అనుమతించింది. ఈ క్రమంలో ఈడీ అధికారులు బుధవారం చంచల్‌గూడ జైలుకు వెళ్లి డాక్టర్ నమ్రత, ఆమె కుమారుడు జయంత్ కృష్ణ, నందిని, సంతోషి, కల్యాణిలను వేర్వేరుగా ప్రశ్నించారు. ఇటీవల సృష్టి ఫెర్టిలిటీ స్కామ్‌కు సంబంధించి ఈడీ అధికారులు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పది చోట్ల సోదాలు నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా ఇతర మెట్రో నగరాలైన కోల్‌కతా, బెంగళూరులో డాక్టర్ నమ్రత పటిష్టమైన నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకున్నట్లు ఈడీ అధికారులు గుర్తించారు. పదేళ్ల నుంచి డాక్టర్ నమ్రత పక్కా పథకం ప్రకారం ఫెర్టిలిటీ కేంద్రాలకు వచ్చిన వారిని నమ్మించి మోసాలకు పాల్పడుతోందని, శిశువుల క్రయవిక్రయాలకు సంబంధించిన ఆధారాలను ఈడీ అధికారులు సేకరించారు. డాక్టర్ నమ్రతతో పాటు మరికొందరిపై గోపాలపురం పోలీసులు నమోదు చేసిన కేసును తదుపరి దర్యాప్తు నిమిత్తం సిట్‌కు అప్పగించారు. ఆ తర్వాత మనీలాండరింగ్ కోణంలో విచారణ ప్రారంభించారు.

## BC ల వెనుక లేని బడా నాయకులు

**మొన్నటి "BC బంద్" తో సాదా సీదాగా 'పైన పాటరం లోన లొటారం' అన్నట్టు ప్రతీ పార్టీ ద్వితీయ శ్రేణి నాయకత్వంలో ఉన్న కొందరు బీసీ నాయకులను మాత్రమే పాల్గొనేలా చేసింది . దీన్ని బట్టి చూస్తే మొదటి శ్రేణి నాయకత్వంలో ఉన్న కమ్మ,కాపు,వెలమ,రెడ్డీ నాయకులకు తెలంగాణలో బీసీ రిజర్వేషన్స్ ఇవ్వడం కానీ దాన్ని పార్లమెంట్ లో పెట్టి రక్షణ చట్టం చేయించడం కానీ ఎవరికీ ఇష్టం లేదని తేటతెల్లం అయ్యింది . ఇక్కడ తెలంగాణ ప్రజలు ఆలోచించాల్సిన విషయం వేల యేండ్లుగా 90% బహుజనులు అభివృద్ధికి నోచుకోకుండా ప్రధానంగా ఎవరు కారణమౌతున్నారే అంశంచాలా కీలకమైనది . ముఖ్యంగా EWS రిజర్వేషన్స్ కింద 10% అత్యంత తక్కువ సమయంలో ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం న్యాయం పరంగా పొందాల్సిన బీసీ రిజర్వేషన్స్ నీ రాష్ట్ర ప్రభుత్వాలకు ఎందుకు ఇవ్వడం లేదు..? దీన్ని బట్టి ప్రధాన శత్రువు బీజేపీ నే అనీ అసలు రిజర్వేషన్స్ పెంచని గత ప్రభుత్వం ఆ కోవలోనే ఉందని చిత్త శుద్ధితో అమలుచేయకపోతే నేటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఆ వరుసలోనే చేరుతుందని గుర్తు చేసుకోవలసిన సందర్భం ఆసన్నమైంది. ఈ తరుణంలో బీసీలు అంతా ఒక ఉమ్మడి కార్యాచరణ కు తెరలేపి ఎవరితో కలిసి నడిస్తే మన హక్కులు పొందావచ్చానే సత్యాన్ని గ్రహించి తమ తమ రాజకీయ చైతన్యానికి పదును పెట్టాల్సిన సమయం.ప్రజలు ముఖ్యంగా BC సమాజం మనకెందుకులే అనీ ఇంట్లోనే కూర్చుంటే పొందాల్సిన హక్కులను కోల్పోవడమే కాకుండా రాబోయే తరానికి వారు అనుభవించిన బానిసత్వాన్ని అంటగట్టిన వారమౌతారని గుర్తుచేస్తూ.**

జై బీసీ, జై భీమ్
రచన, బాబు మహారాజ్







# దౌల్తాబాద్,బేగంపేట పోలీస్ స్టేషన్లలో ఓపెన్ హౌస్

**- విద్యార్థులకు చట్టాలు, పోలీస్ విధులపై అవగాహన**

**దౌల్తాబాద్ అక్టోబర్ 22 సిద్దిపేట టైమ్స్**

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం ఫ్లాగ్ డే కార్యక్రమాల లో భాగంగా బేగంపేట, దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్లలో ఓపెన్ హౌస్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 150 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.విద్యార్థులకు పోలీస్ స్టేషన్ కార్యకలాపాలు, కేసులు నమోదు విధానం, నేరస్తులను పట్టుకోవడం, ప్రజల ప్రాణ ధన రక్షణకు పోలీసులు తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. అదే విధంగా మహిళల, పిల్లల రక్షణకు ఉన్న చట్టాలు, ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతా నియమాలు, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల హానికర ప్రభావాలు, సైబర్ నేరాల నివారణపై అవగాహన కల్పించారు.అదనంగా పోలీస్ స్టేషన్లలోని వివిధ విభాగాలు, సీసీ కెమెరాల ఫంక్షనింగ్, డయల్ 100 సేవ, బ్లూ కోర్స్, పెట్రోల్ కార్ పనితీరు, పోలీసుల విధులు, ఆధునిక టెక్నాలజీ వినియోగం, సీఈఆర్ ద్వారా మొబైల్ రికవరీ, కమ్యూనికేషన్ విహెచ్ఎఫ్ సెట్ వినియోగం వంటి అంశాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమాలలో ఎస్ఐలు మహిపాల్ రెడ్డి, అరుణ్ కుమార్ ఇతర పోలీస్ సిబ్బంది విద్యార్థులకు చట్టాలు, పోలీస్ విధులపై స్పష్టమైన అవగాహన కల్పించారు. విద్యార్థులు పోలీస్ పనితీరును ప్రత్యక్షంగా చూసి ఆనందం వ్యక్తం చేశారు.



# సిద్దిపేట వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఓపెన్ హౌస్ కార్యక్రమం

**సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట, అక్టోబర్ 22**

సిద్దిపేట వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవం ఫ్లాగ్ డే కార్యక్రమంలో భాగంగా ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ప్రవేట్ స్కూల్ విద్యార్థినీ విద్యార్థులు సుమారు 200 ,మంది విద్యార్థులు, పాల్గొన్నారు. వారికి పోలీస్ స్టేషన్ పోలీస్ స్టేషన్ ఫంక్షన్ చట్టాలు అమలుపరుస్తున్న తీరు, కేసులు నమోదు, నేరస్తులను పట్టుకోవడం, ప్రజల ధనమాన ప్రాణ రక్షణకు తీసుకుంటున్న చర్యల గురించి, మహిళల పిల్లల రక్షణకు ఉన్న చట్టాల గురించి, ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనల గురించి, గంజాయి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల గురించి, జరుగుతున్న సైబర్ నేరాల గురించి, పోలీస్ స్టేషన్లో ఉన్న వివిధ గదులు మరియు సీసీ కెమెరాలు ఫంక్షన్, డయల్ 100 ప్రాముఖ్యత, బ్లూ కోర్స్, పెట్రో కార్, పోలీసుల ముఖ్య విధుల గురించి తదితర అంశాల గురించి, పోలీసులు ఉపయోగిస్తున్న నూతన టెక్నాలజీ, సీఈఆర్ ద్వారా ఫోన్లో రికవరీ, కమ్యూనికేషన్ విహెచ్ఎఫ్ సెట్ తదితర అంశాల గురించి వన్ టౌన్ ఇన్స్పెక్టర్ వాసుదేవరావు అవగాహన కల్పించారు.







# పేదల పాలిట పెన్నిధి లీల గ్రూప్ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్

**- లీల గ్రూప్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం**

**సిద్దిపేట్ టైమ్స్ రామాయంపేట అక్టోబర్ 22**

ప్రముఖ సంఘ సేవకుడు లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్ ఆధ్వర్యంలో నిజాంపేట మండల కేంద్రంలో పేద ప్రజల కోసం బుధవారం నాడు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది. సుమారు 650 మంది హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ శిబిరంలో రోగులకు ఉచితంగా బిపి షుగర్ రక్తపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి లీలా గ్రూప్స్ ఆధ్వర్యంలో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తామని లీలా గ్రూప్ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్ తెలిపారు. ఈ శిబిరంలో డాక్టర్ మోహన్ నాయక్ రోగులకు స్వయంగా వైద్య పరీక్షలు నిర్వహించి వ్యాధులకు అనుగుణంగా మందులను అందజేశారు.

**ఉచిత వైద్యంతో పేదలకు మేలు**

**మోహన్ నాయక్ సేవలను మండల ప్రజలకు సద్వినియోగం చేసుకోవాలి_ అమర సేనా రెడ్డి**

లీలా గ్రూప్ చైర్మన్ ప్రముఖ సంఘ సేవకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మోహన్ నాయక్ అందిస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల సర్పంచ్ల ఫోరం మాజీ అధ్యక్షులు అమరసేనారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని 2,3,4,5, వార్డుల ప్రజలకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా అమరసేనారెడ్డి మాట్లాడుతూ పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్లకు పుస్తే మట్టెలు కానీ ఆర్థిక సహాయం, చనిపోయిన కుటుంబాలకు ఆర్థిక సహాయం అందిస్తూ మెదక్ నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ అనేక సామాజిక సేవా కార్యక్రమాలను చేస్తున్న మోహన్ నాయక్ సేవలను మండల ప్రజలు వినియోగించుకోవాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాలలో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలందరికీ వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెల్దుర్తి వెంకటేష్ గౌడ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాబు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మహేందర్ , మారుతి, నజీరుద్దీన్, వై వెంకటేశం, కోమాట సుధాకర్, గరుగుల శ్రీనివాస్, నాగరాజు, శ్రీశైలం, సామల మహేష్, తదితరులు పాల్గొన్నారు








# తిర్మలాపూర్ గ్రామ లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**సిద్దిపేట టైమ్స్ దౌల్తాబాద్**

దౌల్తాబాద్ మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ (CMRF) చెక్కులను దుబ్బాక శాసన సభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి ఆదేశాల మేరకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని మాజీ ఎంపీటీసీ ల ఫోరం అధ్యక్షుడు బండారు దేవేందర్, మాజీ సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు సరుగారి యాదవ్ రెడ్డి గార్ల చేతుల మీదుగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా తిర్మలాపూర్ గ్రామానికి చెందిన కొంతమంది అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందిన నేపథ్యంలో, వారి వైద్య ఖర్చులను తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరు చేసిందని తెలిపారు. లబ్ధిదారులు: కరికే రాణి - 17,000, నక్క శాంతమ్మ - 7,500, కరికే రాజమణి - 12,500, గొల్ల సత్తవ్వ - 29,000, బండారు బాలవ్వ - 22,000, త్తం రూ. 88,000 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, వికలాంగుల సంఘం అధ్యక్షుడు నర్సింలు, శ్రీకాంత్, చంద్రయ్య, వెంకట్ రెడ్డి, లక్ష్మినర్సింహస్వామి, నాగరాజు, రమేష్, స్వామి, యాదవ్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, కనరాజు, పోచయ్య, నర్సింలు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



# సూరంపల్లి గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**- ప్రజలకు సేవ చేయడం మన కర్తవ్యం**

**సిద్దిపేట టైమ్స్ దౌల్తాబాద్**

మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు గారి ఆదేశాల మేరకు సూరంపల్లి గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చామంతి రాజు వారి కుమార్తె చామంతి శ్రీలేఖకు రూ. 9,000 విలువైన చెక్కును గ్రామ బూత్ అధ్యక్షులు తైల కుమార్, దుబ్బాక నియోజకవర్గ మంకీ బాత్ అధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్, గ్రామ మాజీ ఉప సర్పంచ్ బొల్లం స్వామి కలిసి అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ – “గ్రామ ప్రజల్లో ఎవరికైనా పెద్ద కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారు ఉంటే, వారి ఆసుపత్రి బిల్లులను మన సూరంపల్లి బీజేపీ కార్యకర్తలకు అందజేయండి. ఆ బిల్లులను మన మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు ఆధ్వర్యంలో సీఎంఆర్ఎఫ్ (CMRF) కి సమర్పించి, సంబంధిత లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తాం,” అని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా నాయకులతో పంచుకోవాలని, ప్రభుత్వ పథకాల ద్వారా అందించే సహాయాలను సద్వినియోగం చేసుకోవాలని నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తోడంగి రాజు, కడారి శంకర్, తలారి శ్రీకాంత్, కడారి పెద్దోళ్ల ఎల్లం, జంగపల్లి స్వామి గౌడ్, చామంతి స్వామి, కేసోల్ల నర్సింలు, సోల్ల కనకయ్య తదితరులు పాల్గొన్నారు.



# కళ్యాణ లక్ష్మి చెక్కుల కోసం ఆడబిడ్డల ఎదురుచూపులు

**- చెక్కులు పంపిణీ చేయాలని వినతులు.**

**సిద్దిపేట్ టైమ్స్ రామాయంపేట అక్టోబర్ 22**

రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద పేదింటి మహిళ కోసం కల్యాణ లక్ష్మి పథకాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చింది. ఒక ఆడపిల్ల పెళ్లి చేసే తండ్రి కి కొంతమేర సహాయంగా కల్యాణ లక్ష్మి ఉపయోగపడుతుంది. ఈ మేరకు నిజాంపేట మండల వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో పేదింటి తల్లిదండ్రులు ఆడబిడ్డకు పెళ్లి చేశారు. కల్యాణ లక్ష్మికి అప్లై చేసినప్పటికీ సుమారు ఐదు, ఆరు నెలలుగా చెక్కులు పంపిణీ చేయడం లేదు. ఇది అధికారుల నిర్లక్ష్యమా! ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యమా! అనే సందేహాలు ప్రజల్లో మొదలయ్యాయి. వెయ్యి కళ్ళతో కళ్యాణ లక్ష్మి చెక్కుల కోసం నిరుపేద లబ్ధిదారులు ఎదురుచూస్తూ ఉన్నారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి వెంటనే కల్యాణ లక్ష్మి చెక్కులను అందివ్వాలని వేడుకుంటున్నారు.




# పరిశుభ్రత పై నగరం పాఠశాలకు మండలంలోనే మొదటి స్థానం

**సిద్దిపేట్ టైమ్స్ రామాయంపేట అక్టోబర్ 22**

స్వచ్ఛత పరిశుభ్రత హరిత పాఠశాల కార్యక్రమంలో భాగంగా 2025 సంవత్సరానికి గాను నిజాంపేట మండలం నగరం ప్రభుత్వ పాఠశాల మొదటి స్థానాన్ని దక్కించుకుందని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమారాణి అన్నారు. ఆమె మాట్లాడుతూ.. పాఠశాల పరిశుభ్రత విషయం లో 61 అంశాల్లో పాఠశాల పురోగతిని పరిశీలించి రేటింగ్స్ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ రేటింగ్స్ లో మండలంలోని నగరం తండా గ్రామంలో గల పాఠశాల ఫైవ్ స్టార్ రేటింగ్ తో మొదటి స్థానం లో నిలిచిందని ఆనందం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు వెంకటేష్, కల్పన ఉన్నారు.

# అనారోగ్యంతో రైతు మృతి..



**సిద్దిపేట్ టైమ్స్ రామయంపేట అక్టోబర్ 22**

రామాయంపేట మండలం తొనిగండ్ల గ్రామానికి చెందిన రైతు పేగుడ దుర్గయ్య (68) 25 రోజుల క్రితం పొలం నుండి ఇంటికి వస్తుండగా ఒక్క సారిగా కళ్ళు తిరిగి పొలం వద్ద పడిపోయాడు చుట్టుప్రక్కల రైతులు వచ్చి దుర్గయ్యను లేపగా అతను లేవకపోవడంతో దుర్గయ్య కోమాలకు వెళ్లడంతో 108 అంబులెన్స్ కి ఫోన్ చేశారు. 108 లో రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించారు దుర్గయ్య కు బిపి ఎక్కువ అవ్వడంతో కోమాలకు వెళ్లినట్టు వైద్యులు తెలిపారు. వెంటనే హైదరాబాద్ కి తరలించగా మేడ్చల్ వద్ద ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి మెరుగైన వైద్యం అందించారు. అయినా రైతు దుర్గయ్యను మృత్యువు వదలలేదు. 26 రోజులుగా దుర్గయ్య చికిత్స పొందుతూ బుధవారం రోజున తెల్లవారుజామున మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. దుర్గయ్య భార్య లక్ష్మి అనారోగ్యంతో సంవత్సరం కిందట మృతి చెందింది. దుర్గయ్య కు ముగ్గురు కూతుర్లు ఉన్నారు. ఈ మేరకు తొనిగండ్ల గ్రామంలో విషాద ఛాయలు అనుమతించాయి.



# బాధిత కుటుంబాలను పరామర్శించిన కొమ్మూరి

**సిద్దిపేట టైమ్స్ చేర్యాల ప్రతినిధి:**

కొమురవెల్లి మండలంలోని మర్రిముచ్చల గ్రామంలో ఇటీవల మరణించిన గౌరీబట్ల శ్రీనాథ శర్మ కుటుంబాన్ని జనగామ డిసిసి అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాపరెడ్డి బుధవారం పరామర్శించారు. అనంతరం ఒగ్గు తిరుపతి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కొమరవెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్, సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు మెరుగు శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంజ మల్లేశం, చేర్యాల పట్టణ అధ్యక్షుడు దాసరి శ్రీకాంత్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జీవన్ రెడ్డి, కొమరవెల్లి మండల ప్రధాన కార్యదర్శి సనాది భాస్కర్, నాయకులు బొచ్చు ఎల్లయ్య యాదవ్, భాస్కర్ రెడ్డి, వినీత్, జంగని రవి, నవీన్ గౌడ్, వంగ కృష్ణారెడ్డి, వంగ సంజీవరెడ్డి, శ్రీనివాస్, జంగని నాగరాజు, దువ్వల రమేష్, జక్కనపల్లి స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఆటో కార్మికులకు భృతి విడుదల చేయాలి



**సిద్దిపేట టైమ్స్, నంగునూరు, అక్టోబర్ 22:**

ఉపాధి కరవై కుటుంబాలను పోషించుకోలేక ఆటో కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారని సిద్దిపేట జిల్లా బీఆర్ఎస్ ఆటో డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు, నంగునూరు మండల కార్మిక విభాగం అధ్యక్షుడు గోనేపల్లి సిద్దేశ్వర్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. నంగునూరు లో బుధవారం మీడియాతో మాట్లాడుతూ సిద్ధిపేట జిల్లా కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లిలోని ఎస్సీ కాలనీకి చెందిన ఆటో కార్మికుడు మార్వాడి దేవదానం బుధవారం చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని బాధను వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆటోలకు గిరాకీ తగ్గి, ఆటోలు నడవక ఆటో కార్మికులు కుటుంబాన్ని పోషించుకోలేని దుస్థితి ఏర్పడిందని చెప్పారు. గత ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ అబద్ధపు ప్రచారంతో ఇచ్చిన 420 హామీలలో మహాలక్ష్మి పథకంతో ఆటో కార్మికుల బతుకులు దుర్భరంగా మారాయన్నారు. మహాలక్ష్మి పథకాన్ని అమలు చేస్తున్న ప్రభుత్వం ఆటో కార్మికులు ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఎంతోమంది ఆటో కార్మికులు జీవనోపాధి కోల్పోయి కుటుంబాలను పోషించుకోలేక మరణిస్తున్నారని చెప్పారు. చనిపోయిన ఆటో కార్మికుల మరణాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో ఆటో కార్మికులు తం సమస్యలు పరిష్కరించాలని కోరితే పట్టించుకోకుండా వారిపైన అక్రమ కేసులు పెడుతూ రాక్షసానందం పొందుతున్నారని విమర్శించారు. చనిపోయిన మా ఆటో కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్ గ్రేసియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులకు ఇస్తామన్న రూ.12 వేల భృతిని ఇవ్వడంతో పాటు, ఆటో కార్మికులకు జీవనోపాధి కల్పించాలని కోరారు .



# గిరిజన ఆశ్రమ పాఠశాల కార్మికుల సమ్మె

**- గంగిరెద్దుకు వినతిపత్రం**

**సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట, అక్టోబర్ 22:**

గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్లో పని చేస్తున్న డైలీ వేజ్, కాంటినింజెంట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 12నుంచి కొనసాగుతున్న నిరవధిక సమ్మె 41వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా గంగిరెద్దుకు వినతిపత్రం ఇచ్చి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూఉద్యోగాలను పర్మినెంట్ చేయాలి, టైం స్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాత జీతాలను జిల్లా గెజిట్ ప్రకారం చెల్లించాలి. మరణించిన వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. పూర్తి కాలం పనిచేస్తున్న వారందరికీ పూర్తి వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 3,650 మంది సమ్మెలో పాల్గొంటున్నారు. సిద్దిపేట జిల్లాలోని 25 మంది కూడా ఈ సమ్మెలో ఉన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తగిన నిర్ణయం తీసుకోవాలని, లేనిపక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని జేఏసీ నేతలు గంగా శ్రీను, కిషన్, రమేష్, శారద, సురేష్, లక్ష్మి తదితరులు హెచ్చరించారు.





# రైతులు దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు

**- ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు సెంటర్ లోనే ధాన్యాన్ని విక్రయించాలి.**
**- ఉపాధ్యాయునిగా మారిన కలెక్టర్ రాహుల్ రాజ్**

**సిద్దిపేట్ టైమ్స్ మెదక్ ప్రతినిధి అక్టోబర్ 22**



బుధవారం కౌడిపల్లి మండల వెల్మ కన్నె గ్రామంలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతి, ఫ్యాక్స్ కొనుగోలు కేంద్రంన్నీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ మెదక్ జిల్లా వ్యాప్తంగా 498 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, అందులో దాదాపు 100 కేంద్రాల్లో దాన్యం రావడం మొదలైంది అన్నారు. కేంద్రాల దగ్గర రైతులు ధాన్యాన్ని ఆరబెడుతున్నారని అందులో మాయిచ్చరైన ధాన్యానికి టోకెన్ అందిస్తున్నామని తెలిపారు. టోకెన్ అందించడంతోపాటు మిల్లులకు కూడా ట్యాగింగ్ ఇచ్చేస్తున్నామన్నారు. ధాన్యం సరఫరాకు వాహనాలన్నీ సిద్ధంగా ఉన్నాయని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు బిల్లులు త్వరగా చెల్లించేందుకు కూడా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. రామాయంపేట మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రవాణా అవుతుందని తెలిపారు. రైతులు దళారులను నమ్మి రైతులు మోస పోవద్దని,ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు సెంటర్ లోనే ధాన్యాన్ని విక్రయించాలని వెల్లడించారు.,మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు ప్రభుత్వ పాఠశాలలు నాణ్యమైన గుణాత్మక విద్యకు సోపానాలని, . ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద పిల్లలందరూ కూడా నాణ్యమైన విద్యద్వారా అభివృద్ధి పథంలోకి రావాలని దానికి ఉపాధ్యాయులపై ఆధారపడి ఉందని, కావున విద్యార్థులకు లెక్కలు మరియు ఆంగ్లం మీద పట్టు సాధించే విధంగా తర్ఫీది ఇవ్వాలని తెలిపారు. విద్యార్థులతో 30 నిమిషాల సేపు పాఠ్యాంశాలపై వివిధ ప్రశ్నలు అడగడం వారితో ముచ్చటించడం జరిగింది. ఉపాధ్యాయిని పదినిమిషాలు పాఠం చెప్పించి తర్వాత ఆమెను అభినందించారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి, చిన్నారులకు, బాలింతలకు అంగన్వాడీ కేంద్రం అమలు చేస్తున్న కార్యక్రమాలను అడిగి తెలుసుకుని, చిన్నారుల సామర్థ్యాలను పరిశీలించారు. . అనంతరం నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. గ్రామానికి ఎన్ని ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని, గ్రామంలో ఎన్ని ఇండ్లు నిర్మాణంలో ఉన్నాయని . అవి ఏ ఏ దశలల్లో ఉన్నాయని తెలుసుకున్నారు. ఇప్పటి వరకు అయినంత వరకు లబ్ధిదారుల అకౌంట్ కి డబ్బులు వచ్చాయా అని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు అన్ని బిల్లులు వచ్చాయా లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు



# ఉద్వాసన పూజలో.. పాల్గొన్న మున్సిపల్ చైర్పర్సన్ మంజుల

**సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట, అక్టోబర్ 22:**

సిద్దిపేట పట్టణంలోని 39వ వార్డులోని స్వచ్ఛ బడిలో స్థానిక వార్డు కౌన్సిలర్ దీప్తి నాగరాజు ఆధ్వర్యంలో చేపట్టిన పాడైన, పగిలిపోయిన, విరిగిపోయిన దేవుళ్ళ చిత్ర పటాలను విడి భాగాలుగా వేరు చేయుట కార్యక్రమం.. ఉద్వాసన పూజలో సిద్దిపేట మున్సిపల్ చైర్పర్సన్ శ కడవేరుగు మంజుల రాజనర్సు పాల్గొన్నారు. ఇట్టి కార్యక్రమానికి వేదపండితులు గోసాం శివప్రసాద శాస్త్రి విచ్చేసి ఉద్వాసన పూజను నిర్వహించారు. మొదట గణపతి పూజ, గోమాత పూజ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.






# స్థానిక సంస్థల ఎన్నికలు వెంటనే నిర్వహించాలి

**- ఎన్నికల కమిషన్ లు స్వతంత్రంగా వ్యవహరించకుండ ప్రభుత్వంలో ఒక శాఖ గా వ్యవహరిస్తున్నవి**
**- తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దోనె అశోక్**

**సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట, అక్టోబర్ 22**



స్థానిక సంస్థల ఎన్నికలు వెంటనే నిర్వహించాలి గ్రామాలలో సర్పంచులు వార్డు మెంబర్లు లేక ప్రత్యేక పాలనలో గ్రామ అభివృద్ధి కుంటుబడిపోయి పల్లెలు అధ్వానంగా మరిపాయినవి రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఎన్నికలు రాష్ట్ర ప్రభుత్వం చెప్పినట్లు వినుకుంటూ రాష్ట్ర ప్రభుత్వంలో ఒక శాఖగా వ్యవహరిస్తుంది అని తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దోనె అశోక్ గారు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ను తప్పుబట్టారు.గ్రామాలలో అభివృద్ధి లేక పల్లెలు కాలుష్య కోరల్లో కొట్టుమిట్టాడుతున్నాయి ప్రత్యేక అధికారులు సమయానికి రాక గ్రామాలను పట్టించుకోకపోవడంతో చాలా సమస్యలు ఉత్తమమైనప్పటికిని ప్రజలు ఎవరిని అడగాలో తెలియక అయోమయ పరిస్థితుల్లో తమ యొక్క జీవనాన్ని సాగిస్తున్నారు. తెలంగాణ హైకోర్టు ఎన్నికలు నిర్వహించాలని చెప్పినప్పటికిని ఎన్నికల కమిషన్ ఎన్నికల నిర్వహించకుండా రాష్ట్ర ప్రభుత్వంలో ఒక భాగంగా వ్యవహరిస్తుంది. ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా వ్యవహరించే ఒక అత్యుత్తమైన వ్యవస్థ కానీ దాని యొక్క పనిని మర్చిపోయి ఎన్నికల కమిషన్ రాష్ట్ర ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మగా మారింది.భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 243K పంచాయతీలకు జరిగే అన్ని ఎన్నికలను నిర్వహించే అధికారం వాటికి ఉన్నప్పటికిని ఎన్నికల కమిషన్ నిర్వహించడం లేదు. కావున ఎన్నికల కమిషన్ వెంటనే స్పృహలోకి వచ్చి ఆర్టికల్ 243 కె ద్వారా ఎలక్షన్లు జరిపి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ డిమాండ్ చేస్తున్నాం. ఇట్టి కార్యక్రమంలో నాయకులు మల్యాల శేషు కుమార్, ఎండి సాజిద్ పాషా, సిహెచ్ మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# సిద్దిపేట మార్కెట్‌లో వడ్ల, మక్కల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన హరీష్ రావు

**సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట, అక్టోబర్ 22:**

రైతుల సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వం అనాసక్తి చూపుతోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. సిద్దిపేట మార్కెట్ యార్డ్‌లో వడ్లు, మక్కల కొనుగోలు కేంద్రాలను మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూమక్కల కొనుగోలు ప్రారంభంలో ప్రభుత్వం తీవ్ర ఆలస్యం చేసిందని ఆయన విమర్శించారు. ఇప్పటికీ సుమారు 14,000 క్వింటాళ్ల మక్కలు దళారుల చేతికి వెళ్లిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు." కొనుగోలు కేంద్రాల ప్రారంభంలో ఆలస్యంతో రైతులు మద్దతు ధర కంటే తక్కువ ధరలకు, క్వింటాలకు కేవలం రూ.1600 చొప్పున దళారులకు అమ్మకాలు జరిపే పరిస్థితి ఏర్పడిందని హరీష్ రావు అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ప్రతి ఎకరాకు కేవలం 18 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తామని పెట్టిన నిబంధనను ఆయన తీవ్రంగా విమర్శించారు. సాధారణంగా ఒక్క ఎకరాలో 25 నుంచి 30 క్వింటాళ్ల వరకూ పంట పండుతుందని, 18 క్వింటాళ్లు మాత్రమే కొనడం రైతులపై అన్యాయంగా ఉంటుందని చెప్పారు. "పండిన పంట అంతా కొంటాం, బోనస్ ఇస్తాం అని హామీ ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి మాటలపై అమలు కనిపించదు. కొనుగోలు కేంద్రాలు కూడా అడగగా అడగగా అరిగోస పెట్టీ ప్రభుత్వం ప్రారంభిస్తున్న పరిస్థితి బాధాకరం, " అని హరీష్ రావు అన్నారు. మక్కల కొనుగోలు మీద పెట్టిన నియంత్రణలను తక్షణమే ఎత్తివేయాలని, రైతుల చేతిలో ఉన్న మొత్తం పంటను పూర్తిగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ, రైతుబంధు, పంటల బోనస్ వంటి విషయాల్లో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం సగం మాటలు, సగం చర్యలతో ముందుకు వెళ్తోందని హరీష్ రావు విమర్శించారు. "సగం సగం - ఆగం ఆగం అనే విధంగా రేవంత్ రెడ్డి పాలన సాగుతోందని" ఆరోపించారు. "మిగిలిన రుణమాఫీని వెంటనే పూర్తిచేయాలి. అన్ని పంటలకు బోనస్ ఇవ్వాలి. పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నానని హరీష్ రావు హెచ్చరించారు.

# నేటి విద్యార్థులే రేపటి నవ సమాజ నిర్మాతలు

**- పోలీస్ ఓపెన్ హౌస్ కార్యక్రమంలో సిఐ వెంకటరాజా గౌడ్**

**సిద్దిపేట్ టైమ్స్ రామాయంపేట అక్టోబర్ 22**




పోలీస్ అమరవీరుల వారోత్సవాలలో భాగంగా రామాయంపేట పట్టణంలోని వివేకానంద విద్యాలయానికి చెందిన 62 మంది విద్యార్థులు పోలీస్ శాఖ పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న పట్టుబడ్డ వాహనాలు, పెట్రోలింగ్ వాహనాల వినియోగ విధానం, ఎస్ హెచ్ ఓ కార్యాలయం, రిసెప్షన్ గది, అలాగే దొంగలను నిర్బంధించే గదులు, సీసీ కెమెరా నియంత్రణ వాచ్ రూమ్ లను విద్యార్థులు ప్రత్యక్షంగా సందర్శించారు.ఈ సందర్శనలో సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటరాజా గౌడ్, సబ్ ఇన్స్పెక్టర్ బాలరాజు విద్యార్థులకు పోలీస్ విభాగం నిర్వహణ, భద్రతా చర్యలు, పోలీస్ చట్టాలపై, నేర నిరోధక వ్యవస్థపై సమగ్ర అవగాహన కల్పించారు.విద్యార్థుల్లో దేశభక్తి,క్రమశిక్షణ,సేవాస్ఫూర్తి పట్ల మక్కువ పెంచే లక్ష్యంతో ఈ అవగాహన కార్యక్రమం చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ వెంకట రాజా గౌడ్ మాట్లాడుతూ విద్యార్థి దశ ప్రతి ఒక్కరికి కీలకమని అనుకున్న లక్ష్యంతో ముందుకు సాగితే విద్యార్థి తాను అనుకున్నది సాధించవచ్చు అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు విద్యార్థులు పాల్గొన్నారు.



# బీసీ రిజర్వేషన్ల సాధన కోసం జరుగుతున్న మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యండి

**సిద్దిపేట జిల్లా బీసీ రిజర్వేషన్ల సాధన సమితి.**

**సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట, అక్టోబర్ 22**

42% బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని 9 వ షెడ్యూల్ లో చేర్చాలనే డిమాండ్ తో ఈ నెల 24 వ తేదీన హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద జరిగే మహాధర్నా కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరణ స్థానిక అంబేద్కర్ చమన్ వద్ద ఆవిష్కరించారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అత్యంత ఎక్కువ జనాభా కలిగి అత్యల్ప ప్రయోజనాలు పొందుతూ అన్ని రంగాల్లో నష్టపోతున్న బీసీ లకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో జనాభా దామాషా ప్రకారం ప్రాతినిధ్యం కల్పించాలని, పార్లమెంటు లో చట్టం చేసి భారత రాజ్యాంగం లోని 9 వ షెడ్యూల్ లో చేర్పిస్తేనే బీసీ లకు న్యాయం జరుగుతుందని అన్నారు.అందుకోసం ఈ నెల 24 వ తేదీన ఇందిరాపార్క్ వద్ద మహాధర్న జరుగుతున్నది. ఈ మహా పోరాటంలో బీసీ మేధావులు, ఉద్యోగులు, యువకులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరు అయి విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ రిజర్వేషన్ల సాధన సమితి నాయకులు మహమ్మద్ రఫీ, పౌర హక్కుల వేదిక జిల్లా అధ్యక్షులు రాగుల భూపతి, న్యాయవాదులు బాబురావు, దబ్బేడ యాదయ్య, గుండ్ర రమేష్,BC, SC, ST JAC నాయకులు రవిబాబు, బోయిని సదన్ మహారాజ్, డి.బి రాజు, చందు, మాంకాళి సురేష్, యాదగిరి, సుమన్ తదితరులు పాల్గొన్నారు...*





# "తెలంగాణ రైజింగ్ 2047 " సిటిజన్ సర్వే లో అందరూ పాల్గొనాలి

**- జిల్లా కలెక్టర్ కే. హైమావతి**

**సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట , అక్టోబర్ 22:**

తెలంగాణ రైజింగ్ 2047 " సిటిజన్ సర్వే లో అందరూ పాల్గొనాలని జిల్లా కలెక్టర్ కే. హైమావతి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర భవిష్యత్ రూపకల్పనకై ఉద్దేశించిన "తెలంగాణ రైజింగ్ 2047 " సిటిజన్ సర్వే కు ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోంది. ఇప్పటివరకు ఈ సిటిజన్ సర్వే లో కేవలం తెలంగాణ నుండే వివిధ ప్రాంతాల పౌరులు పాల్గొని తమ విలువైన సమాచారాన్ని అందచేశారు.భారత దేశ స్వాతంత్ర్యానికి వంద సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా 2047 నాటికి తెలంగాణ రాష్ట్రం ఎలా ఉండాలో ప్రజల నుండి తగు సలహాలు, సూచనలు చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం "తెలంగాణ రైజింగ్ 2047 " సిటిజన్ సర్వేను చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం గత వారం ప్రారంభించిన ఈ సర్వే ఈనెల 25 వతేదీ తో ముగుస్తుంది. ఈ సర్వే రాష్ట్రంలోని ప్రతీ ఒక్కరికీ అందుబాటులో ఉన్నందున www. telangana.gov.in /telanganarising అనే వెబ్సైట్ ను సందర్శించి ప్రతీ ఒక్కరు తమ అమూల్యమైన సలహాలు , సూచనలను అందించాల్సింగా జిల్లా కలెక్టర్ కే.హైమావతి ఒక ప్రకటనలో తెలియ చేశారు.

# విద్యార్థులచే నిజాంపేట్ పోలీస్ స్టేషన్ లో ఓపెన్ హౌస్ కార్యక్రమం



**సిద్దిపేట్ టైమ్స్ రామయంపేట అక్టోబర్22**

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా బుధవారం నాడు నిజాంపేట పోలీస్ స్టేషన్ నందు జెడ్. పి.హెచ్.ఎస్ నిజాంపేట పాఠశాల విద్యార్థులతో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పోలీసు వారి యొక్క విధులను, ప్రజల యొక్క బాధ్యతలను వివరించడం జరిగింది. ఇందులో భాగంగా విద్యార్థులకు వారికి సంబంధించిన బాలల చట్టాలను వివరించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యత తో ఉండాలని విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని వారు అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని నిజాంపేట ఎస్సై బి. రాజేష్ తెలిపారు.

# సంస్కరణ దినోత్సవం సందర్భంగా ఓపెన్ హౌస్




**సిద్దిపేట టైమ్స్ చేర్యాల ప్రతినిధి :**

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం ఫ్లాగ్ డే కార్యక్రమంలో భాగంగా ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని బుధవారం చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు పోలీస్ స్టేషన్లో నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలలకు సంబంధించిన విద్యార్థులు 100 మంది పాల్గొనగా పోలీస్ స్టేషన్లో అమలు చేస్తున్న చట్టాలు కేసులు, నేరస్తులను పట్టుకోవడం, ప్రజల ధన మాన ప్రాణ రక్షణకు తీసుకుంటున్న చర్యలు, మహిళలు పిల్లల రక్షణకు ఉన్న చట్టాలు, ట్రాఫిక్ నిబంధనలు, మత్తు పదార్థాల వాడకం, సీసీ కెమెరాల ఏర్పాటు, డయల్ 100 ప్రాముఖ్యత అంశాలపై చేర్యాల ఎస్సై నవీన్ తో పాటు ఎస్ఐలు షేక్ మహబూబ్, రాజు గౌడ్ లు అవగాహన కల్పించారు.

# కార్తీక దీపోత్సవ సందర్భంగా ప్రత్యేక పూజలు

**సిద్దిపేట టైమ్స్ చేర్యాల ప్రతినిధి :**

కొమరవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో కార్తీక దీపోత్సవ సందర్భంగా బుధవారం స్వామివారి మహా మండప ఆవరణలో ఉత్సవమూర్తుల ఎదుటన శ్రీ మహాగణపతి స్తోత్ర పఠనం చేసి దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు ఈ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని తమ భక్తి భావాన్ని చాటుకున్నారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి అనుమతితో ఆలయ ఏఇవో, పర్యవేక్షకులు, ఆలయ సిబ్బంది, భక్తులకు దీప ప్రమిదలు, పూజా సామాగ్రిని సమకూర్చగా అర్చకులు దీపోత్సవంలో పాల్గొన్న సుహాసినిలకు ప్రసాద తాంబూలాలను అందజేసి ఆశీర్వదించారు.



## మైనారిటీ గురుకులలో మిగులు సీట్ల కొరకు దరఖాస్తుల స్వీకరణ

**సిద్దిపేట టైమ్స్ దౌల్తాబాద్:**
మండలం ఇరుకుల్ల తెలంగాణ మైనారిటీస్ గురుకుల పాఠశాల మరియు కళాశాల కరీంన గర్ బాలుర2లో 202526విద్యా సంవత్సరానికి గాను 5 వ తరగతిలో మిగిలి ఉన్న ఎస్సీ 1, ఎస్టీ1 సీట్ల భర్తీకై దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కనపర్తి సురేష్ ఒక ప్రకటన లో తెలిపారు. కావున ఎస్సీ, ఎస్టీ కేటగిరిలకు చెందిన అభ్యర్థులు 27/10/2025 లోపు పాఠశాల యందు సంప్ర దించాలని కోరారు. వీటితో పాటు 6,7,8,9, తర గతులలో మిగిలిన మైనారిటీ సీట్ల భర్తీకి కూడా దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9949116470 ఫోన్ నంబరులో సంప్రదించాలని పేర్కొన్నారు.

## కేజీవీబీలో అసిస్టెంట్ కుక్ దరఖాస్తుకు ఆహ్వానం

**-మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ రెడ్డి.**
**సిద్దిపేట టైమ్స్ దౌల్తాబాద్**



రాయపోల్ మండల కేంద్రంలో కేజీబీవి పాఠ శాలలో అసిస్టెంట కుక్ పోస్టు ఖాళీగా ఉంది. అసిస్టెంట్ కుక్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవడా నికి తాత్కాలిక ప్రతిపాదికన భర్తీ చేయడానికి దరఖాస్తులు ఆహ్వానించడం జరుగుతుందని రాయపోల్ మండల విద్యాశాఖ అధికారి ఏ. సత్యనారాయణ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేజీబీవీ పాఠశాలలో అసి స్టెంట్ కుక్ గా పనిచేసేందుకు స్థానికులైన మహి ళలకు ఏడవ తరగతి చదివిన వారై, 360 మందికి వంట చేయగల సామర్థ్యం కలిగి అనుభవం కలిగిన వారు అర్హులని తెలిపారు. ఈ పోస్టుగాను రాయపోల్ మండల కేంద్రంలో కేజీబీవీ పాఠశాల లో ఈ నెల 23 తేదీ నుంచి 27 వ తేదీ లోపు దర ఖాస్తుతో పాటు పాస్ ఫోటో ,ఆధార్ కార్డ్ మరియు అనుభవం గల ధ్రువీకరణ పత్రాలు జతపరిచి కేజీబీవీ పాఠశాల యందు స్పెషల్ ఆఫీసర్ కు అం దజేయాలని పేర్కొన్నారు. అనంతరం ఇంటర్వ్యూ డెమో నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. పైన పేర్కొన్న తేదీలలో ఉదయం 10:00 గంటల నుంచి సాయంత్రం 4:00 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని మండల విద్యాధికారి తెలిపారు.

## దౌల్తాబాద్ మండలంలో వడ్ల కొనుగోలు కేంద్రాల ప్రారంభం

**సిద్దిపేట టైమ్స్ దౌల్తాబాద్**



దౌల్తాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మండల పరిధిలోని దీపా యంపల్లి, లింగరాజు పల్లి, శేర్‌పల్లి బందారం, గాజులపల్లి, దొమ్మాట గ్రామాల్లో వడ్ల కొనుగోలు కేంద్రాలు గురువారం ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా సొసైటీ కార్యదర్శి మల్లేశం మా ట్లాడుతూ, రైతులు పండించిన పంటను దళారు లకు విక్రయించకుండా, ప్రభుత్వ నిర్ణయించిన కనీస మద్దతు ధర (MSP) వద్దనే సొసైటీ ద్వారా అమ్మాలని సూచించారు. రైతుల శ్రమకు న్యాయం జరిగే విధంగా పంట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా ప్రభుత్వ సంకల్పం నెరవేరుతుందని తెలిపారు. ఈ ప్రా రంభోత్సవ కార్యక్రమానికి దుబ్బాక శాసనసభ్యు లు కొత్త ప్రభాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రైతులతో మాట్లాడనున్నారు. రైతుల సంక్షేమమే తమ లక్ష్యమని, పంట కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టి నట్లు మల్లేశం వెల్లడించారు.

## నిలిచిన మధ్యాహ్న భోజన బిల్లులు

**- అయోమయంలో కార్మికులు**
**- ప్రభుత్వం తక్షణం బకాయిలు విడుదల చేయాలని డిమాండ్**
**సిద్దిపేట టైమ్స్ దౌల్తాబాద్**



మండలంలోని పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం కింద పనిచేస్తున్న కార్మికులు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఆరు, యుపిఎస్ మూడు, తెలంగాణ మోడల్ స్కూల్‌తో కలిపి మొత్తం 35 పాఠశాలల కు సంబంధించిన మధ్యాహ్న భోజన కార్మికులకు 30 సెప్టెంబర్ నాటికి సుమారు రూ.22 లక్షల బకాయిలు ప్రభుత్వం చెల్లించవలసి ఉంది. అయితే అక్టోబర్ నెల 23వ తేదీ వరకు గడిచిన ప్పటికీ ఇప్పటికీ పాత బకాయిలు విడుదల చే యకపోవడంతో కార్మికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలల్లో డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు ముమ్మరంగా తనిఖీలు నిర్వ హిస్తున్నప్పటికీ, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. "మేము ప్రతిరోజూ పిల్లలకు ఆహారం వండుతూ సేవ చేస్తున్నాం. కానీ నెలల తరబడి బిల్లులు ఇవ్వకపోవడం వల్ల ఆర్థిక ఇబ్బందులు తీవ్రంగా పెరిగాయి," అని పలువురు కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణం స్పందించి పాఠశాలలకు రావలసిన బకాయిలను విడుదల చేసి, కార్మికుల కష్టాలను నివారించాలని వారు డిమాండ చేశారు.



## ఆలయ నిర్మాణ భూమి పూజకు కొమ్మూరికి ఆహ్వాన పత్రిక అందజేత

**సిద్దిపేట టైమ్స్ చేర్యాల ప్రతినిధి :**
కొమరవెల్లి మండలంలోని అయినాపూర్ రిజర్వాయర్ వద్ద చేపట్టిన ఆంజనేయస్వామి దేవాలయ నిర్మాణ భూమి పూజకు సంబంధించిన ఆహ్వాన పత్రికను జనగామ డిసిసి అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాపరెడ్డికి నిర్వాహకులు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 31వ తేదీన జరిగే కార్యక్రమానికి ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. కట్ట మైసమ్మ వైద్యనాథేశ్వర ఆంజనేయ స్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహిస్తునామని అన్నారు. కార్యక్రమ నిర్వహణలో ప్రతి ఒక్కరూ బాధ్యులు కావాలని విజ్ఞప్తి చేశారు.






## ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది

**- జిల్లా విద్యాధికారి ఎల్లంకి శ్రీనివాస్ రెడ్డి**
**సిద్దిపేట టైమ్స్,నంగునూరు అక్టోబర్ 22**
అన్ని వృత్తుల కన్నా ఉపాధ్యాయ వృత్తి ఉన్నత మైనదని అని జిల్లా విద్యాధికారి ఎల్లంకి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నంగునూరు మండల వనరుల కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. నంగునూరు ఉన్నత పాఠశాలలో మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండలంలోని వివిధ పాఠశాలలో పనిచేస్తున్న 11 మంది ఉపాధ్యా యులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమం లో పాల్గొన్న డిఈఓ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయ వృత్తిని మించిన వృత్తి మరొకటి లేదని చెప్పారు. ఉపాధ్యాయులు విద్యార్థు లను బావి భారత పౌరులుగా తీర్చిదిద్ది సమాజానికి మంచి సేవ చేసే విధంగా తయారు చేయాలన్నారు. ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి అని కాలానుగుణంగా కొత్త కొత్త అంశాలు, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తు న్న వృత్యాంతర శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో వినియోగించాలని చెప్పారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యాబోధ నలో మెళకువలను విద్యార్థులకు ఎప్పటికప్పుడు తెలియజేసి వారి తెలివితేటలు పెంచే విధంగా నా ణ్యమైన బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు, ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసే విధంగా ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు కృషి చేయా లన్నారు, సన్మానంతో ఉపాధ్యాయులకు మరింత బాధ్యత పెరుగుతుందని అన్నారు, ఈ కార్యక్రమం లో నంగునూరు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గొట్టిపర్తి రామస్వామి గౌడ్, మగ్దుంపూర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాసరి సుధాకర్, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ జానయ్య, ఉపాధ్యాయ సంఘం నాయకులు పార్థసారథి, మనీష్ కుమార్, జైపాల్ యాదవ్, హరికిషన్, బిక్షపతి, బాలకిషన్ వివిధ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు తదిత రులు పాల్గొన్నారు.

## ఆడెపు చంద్రయ్యను పరామర్శించిన కొమ్మూరి

**సిద్దిపేట టైమ్స్ చేర్యాల ప్రతినిధి :**
కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఆడెపు చంద్ర య్య కు కంటికి సంబంధించిన కేటరాక్ట్ ఆపరేషన్ చేసుకున్న క్రమంలో ఆయనను జనగామ డిసిసి అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాపరెడ్డి బుధవారం పరామ ర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పార్టీ కోసం కష్టపడుతున్న ఆయన ప్రజా క్షేత్రంలోకి త్వరగా రావాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు మండల పార్టీ ప్ర తినిధులు పాల్గొన్నారు.



## అవినీతి లేని పాలనే తెలంగాణ ప్రజారాజ్యం లక్ష్యం

**- రాజకీయాలలో యువత ముందుకు రావాలి**
**- తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రవికుమార్**
**సిద్దిపేట్ టైమ్స్ మెదక్ ప్రతినిధి అక్టోబర్ 22**

రాష్ట్రంలో అవినీతి రహిత పాలన ఏర్పాటుకు యువత ముందుకు రావాలని స్థానిక సంస్థలలో యువత ముందుకు వచ్చి ప్రజాలకు సేవ చేయాలని తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ యొక్క లక్ష్యం తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షు డు రవికుమార్ తెలిపారు బుధవారం మెదక్ జిల్లా కేంద్రంలో కేంద్రంలో గెస్ట్ హౌస్ లో మీడియా సమా వేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అనేక త్యాగాల పునాదుల మీద ఏర్పడి రాష్ట్రం సాధించుకున్నాం కానీ అనేక అంశాల మీద వెనుకబడి ఉన్న తెలంగాణ గ్రామాల వారి అభివృద్ధి చెందడానికి తెలంగాణ ప్ర జారాజ్యం 2000 సంవత్సరంలో ఆవిర్భవించింది అన్నారు రాష్ట్రంలో ఒకే పార్టీ అధికారం ఉన్నప్పటికీ స్థానికంగా అభివృద్ధి చెందలేదని ఆయన అభిప్రాయ పడ్డారు. గ్రామాలు అభివృద్ధి చెందుతేనే రాష్ట్రం అభి వృద్ధి చెందుతుందని దీనికోసం స్థానిక సంస్థల ఎన్ని కలలో యువతకు పెద్ద త్తున అవకాశాలను కల్పించి వారిని రాజకీయ నాయకులుగా ప్రజలకు సేవ చేసే విధంగా తమ వంతు కృషి చేస్తామని వారు తెలిపారు. తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ వారసత్వ రాజకీయా లను ప్రోత్సహించదని ఇప్పుడున్న రాష్ట్రంలో ప్రధాన పార్టీలన్నీ రాజకీయ వారసత్వం కలిగిన నాయకులే ఉన్నారని వాటికి వ్యతిరేకంగా యువత ప్రజారాజ్యం వైపు అడుగులు తీసి రాష్ట్రంలో నాలుగవ అతిపెద్ద పార్టీగా ఎదుగాబోతుందని వారు అన్నారు. స్థానిక సమస్యలతో పాటు హైదరాబాద్ మేయర్ పదవిని ప్ర జారాజ్యం దక్కించుకుంటుందని ఆయన తెలిపారు. ముఖ్యంగా బీసీ రిజర్వేషన్ను 42% కోసం ప్రజారాజ్యం పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని దీనికోసం ప్రధానమం త్రి నరేంద్ర మోడీ రాష్ట్రంలో ఉన్న బిజెపి ఎమ్మెల్యేలు ఎంపీలు కలిసి ప్రధానమంత్రి పై ఒత్తిడి తీసుకురావా లని పార్లమెంటులో చట్టబద్ధత కల్పించాలని స్థానిక సంస్థలతోపాటు చట్టసభలలో బీసీ రిజర్వేషన్ అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు రాబోయే ఎన్నిక లలో యువతకు ప్రాధాన్యత ఇస్తున్న ఏకైక రాజకీయ పార్టీ తెలంగాణ ప్రజారాజ్యమని ఆయన అన్నారు.




## ఝూన్సీలింగాపూర్ గ్రామంలో సొసైటీ కొనుగోలు కేంద్రం ప్రారంభం..

**సిద్దిపేట్ టైమ్స్ రామాయంపేట అక్టో- బర్ 22**
రామాయంపేట మండలంలోని ఝూ న్సీలింగాపూర్ గ్రామంలో రైతుల సౌక ర్యార్థం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సొసైటీ కొనుగోలు కేంద్రం బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఏఈఓ శ్రీనివాస్ మాట్లాడు తూ, రైతుల ఉత్పత్తులను న్యాయమైన ధరలకు కొనుగోలు చేయడం కోసం సొసైటీలు ముందుకు రావడం శుభపరి ణామమని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయడానికి అన్ని ఏర్పాట్లు చేశామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ సెక్రటరీ శ్రీనివాస్, కాంగ్రెస్ గ్రా మాధ్యక్షులు నర్సగల శివయ్య, టేకుమల సత్యనారాయణ, వానప్ప గారి నవీన్ రెడ్డి, భూమా రమేష్, బానప్ప గారి నర్సారెడ్డి, సంజీవరెడ్డి, మంగలి ప్రభాకర్, భాస్కర్ రెడ్డి, దిద్దిరాజు, జాలిగామ నర్స గౌడ్, బోనాల సత్తయ్య, బండమీది రత్నం, మదూరు స్వామి, కమ్మర్ రమేష్ తది తరులు పాల్గొన్నారు. రైతులు సొసైటీ ద్వారా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ, ఈ కేంద్రం వల్ల తమకు సమీపంలోనే ధాన్యం విక్రయం సులభం అవుతుంద ని తెలిపారు.



## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఇంటింటి ప్రచారంలో మాజీ డిప్యూటీ స్పీకర్ ఏం పద్మ దేవేందర్ రెడ్డి

**సిద్దిపేట్ టైమ్స్ మెదక్ ప్రతినిధి అక్టోబర్ 22**
జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా బుధవారం ఎర్రగడ్డ డివిజన్ పరిధిలోని సుల్తాన్ నగర్ లో ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా జూబ్లీ హిల్స్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ కు మద్దతుగా ప్రచారంలో భాగంగా ఇంటింటికి వెళ్లి బీఆర్ఎస్ పార్టీకి ఓటు వే యాల్సిందిగా ప్రజలను అభ్యర్థించారు. ఈ సందర్భం గా పద్మ దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ... జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయన్నారు. కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫల మైందని విమర్శించారు. ఆరు గ్యారెంటీ ల పేరుతో ఎన్నికల ముందు ప్రజల కు హామీలు ఇచ్చి అధికారంలోకి రాగానే అమలు చేయడం లేదన్నారు. కాంగ్రెస్ చేసిన మోసాన్ని ఉప ఎన్నిక ప్రచారంలో ప్రజలకు తెలిపి బీఆర్ఎస్ అభ్యర్థి విజయం కోసం కృషి చేస్తామన్నారు.ఈ ప్రచార కా ర్యక్రమంలో శంకరంపేట్ ఆర్ మండల పార్టీ అధ్య క్షులు పట్లూరి రాజు, నాయకులు సుంకరి కుమార్ గౌడ్, హైమద్, జుబేర్, హసన్ ,నాగార్జున,నీలరాజు, రమేష్ చందర్ ,వెంకట్రాంరెడ్డి, అత్తెల్లి నాగరాజు,ఇ మ్మడినరేష్, బైండ్ల రాజకుమార్, దినాకర్ తదితరు లు పాల్గొన్నారు.



